నమస్తే తెలంగాణ
నిజామాబాద్
ఆదివారం 26 నవంబర్ 2023

# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

# ధరణితోనే దర్జా..





- పారదర్శక వ్యవస్థను రూపుమాపే కుట్ర
- అన్నదాతలను ఆగం చేసేందుకు హస్తం యత్నం
- ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెసోళ్ల జిమ్మిక్కులు
- కాంగ్రెస్ వస్తే మా భూములకు గ్యారంటీ లేదంటున్న రైతులు

## పైసల్ ఇయ్యకుంటే.. భూమి పట్టా జెయ్యకుండె..



**ధరణి అంట..** కేసీఆర్ సర్కారు తెచ్చింది. చాలా బాగుంది. లేదంటే ఊళ్లె మస్తు లొల్లిలు ఉంటుండె. ఒకని భూమి.. ఒకనికి రాస్తుండ్రి. పైసల్ ఇయ్యకుంటె భూమి పట్టానే జెయ్యకుండ్రి. తెలంగాణ ప్రభుత్వం వచ్చినంక ధరణితోని మస్తు ఫాయిదా అయ్యింది. కష్టాలు లేకుండా తాశిలాఫీసులనే పని అయిపోతున్నది. 10 నిమిషాలల్ల రిజిష్టర్ చేస్తున్నరు. గతంలో భూములను పట్టా చేసుకోవాలంటే మస్తు తిప్పలయ్యేది. ఎటెటో తిప్పుతుండ్రి. ముందుగా పట్వారీలు డబ్బులు ముట్టనిదే పని ముట్టకుండె. నెలల తరబడి పట్టా బుక్కులను వారి దగ్గరనే పెట్టుకునేటోళ్లు. పని అంతా వాళ్ల చేతులనే ఉంటుండె. మస్తు సతాయిస్తుండ్రి. గిప్పుడు ఆ పరిస్థితి లేదు. మీ సేవలో దరఖాస్తు చేసుకుటున్నం. తెల్లారే నయా పైసా ఖర్చు కాకుండా పట్టా పాస్‌బుక్కులు చేతికి వస్తున్నయ్. గిసుంటి సౌలత్‌ను కాంగ్రెస్ వస్తే తీసేస్తం అంటున్నది. ఇన్న జెరంత భూమిని కూడా గుంజుకోవాలని చూస్తున్నరు.

**-ఒడ్డెన్న, అనంతగిరి, నవీపేట మండలం**

## గుంట భూమి లేకుంట గుంజుకుంటరు



రేవంత్‌రెడ్డికి వ్యవసాయం గురించి తెలిసేటట్లు లేదు. కుర్చీ కోసం అదోటి.. ఇదోటి.. చెప్తున్నడు. కానీ, రైతులు ఇంతకుముందు లెక్క లేరు. అన్ని తెలుసుకుంటున్నరు. గప్పట్ల ఉన్న బాధలు ఇప్పుడున్నయా? గవన్నీ కేసీఆర్ సార్ వచ్చినంకనే మంచిగైనయ్. కాంగ్రెస్ ఉన్నప్పుడు అన్నీ గలీజ్ దందలే ఉంటుండె. వానిభూమి వీడు.. వీని భూమిని వాడు రాసుకుంటుండె. ఉన్నోడే బాగుపడ్తుండె. గరీబోన్ని ముంచుతుండె. పట్వారీలు, పెద్దసార్లు కలిసి లోపట లోపట మొత్తం గోల్‌మాల్ చేస్తుండ్రి. ధరణి వచ్చినంక గవన్నీ పొయినయ్.. భూమి పంచాయితీలు లేనేలేవు. భూమి రిజిష్టర్ చేసుకోవాలంటే.. మన ముంగటనే చేస్తున్నరు. యజమాని లేకపోతే చేస్తనే లేరు. కాంగ్రెస్ గిట్ల తప్పిదారి గెలిస్తే.. ఇగ భూములను మనకు ఉంచుతరా? గరీబోళ్ల నుంచి గుంట భూమి లేకుంట గుంజుకుంటరు. రేవంత్‌రెడ్డి మాటలను నమ్మేటోళ్లు ఎవరూ లేరు. రైతులను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటున్న సీఎం కేసీఆర్ సారే మళ్లీ గెలుస్తడు.

**- పోశెట్టి, లింగాపూర్, నవీపేట మండలం**

## ధరణి తీసేస్తరు.. మన భూములను తినేస్తరు..



**ధరణిని** తీసేస్తే రెవెన్యూ వ్యవస్థ మొత్తం మళ్లీ ఆగమైపోతుంది. సీఎం కేసీఆర్ సారు మూలంగనే రుపాయి ఖర్చు లేకుండా పట్టదారు పాస్ పుస్తకాలు వస్తున్నాయి. కాంగ్రెస్ సర్కార్ ఉన్నప్పుడు పటేండ్లు, పట్వారీ వ్యవస్థ ఉన్నప్పుడు భూమి పట్టాలు చేసుకోవాలంటే తప్పకుండా లంచాలు ఇవ్వాల్సి వచ్చేది. ఎప్పుడైతే బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తెచ్చిందో అప్పటి నుంచే రైతులు ఊపిరి పీల్చుకున్నరు. భూమిని అమ్మాలన్నా, కొనాలన్నా.. మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే చాలు. అద్దగంట లోపటనే అధికారులు రుపాయి తీసుకోకుండా పట్టా చేసి ఇస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో పైసలు చేతిలో పెట్టకుంటే ఏ పనీ ముట్టకపోయేది. మంచిగున్న సౌలత్‌ను కాంగ్రెస్ గవర్నమెంట్ వస్తే తీసేస్తమంటున్నరు. ధరణిని తీసేస్తరు.. రైతుల పేరుమీద ఉన్న భూములను కూడా మింగేస్తరు. వాళ్లతో చాలా జాగ్రత్తగా ఉండాలె.

**-వంజరి రాజేశ్వర్, యంచ, నవీపేట మండలం**

## ధరణి పోతే దళారులొస్తరు..



**కాంగ్రెస్ వారు** ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని అంటున్నారు. ధరణిని రద్దు చేస్తే తిరిగి దళారులు మార్కెట్‌లోకి వస్తారు. ధరణితో భూముల క్రయ విక్రయాలతోపాటు, సులభంగా ఒక్కరోజులోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతున్నది. ఇలాంటి పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ వారు ధరణిని రద్దు చేస్తామని చెప్పడం శోచనీయం. ధరణిని రద్దు చేస్తే భూముల క్రయవిక్రయాల కోసం ఆఫీసులు, అధికారులు, దళారుల చుట్టూ తిరగాల్సి ఉంటుంది. మాకు తెలిసిన రైతులు ఒక్క రోజులోనే ధరణి ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. గతంలో భూములు అమ్మినా, కొన్నా మిగితా పనులన్నీ పక్కన పెట్టి రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. మ్యుటేషన్లు పెండింగ్‌లోనే ఉండేది. ఇలాంటి సమస్యలకు ధరణితో చెక్‌పడింది. ఏండ్ల కాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు కేవలం ధరణితో తీర్చేశారు.

**-ఎస్. నాగేశ్వర్ రావు, ఎడపల్లి**

## ధరణితోనే భూములకు రక్షణ..



**రాష్ట్రంలో భూములకు** రక్షణ కల్పించింది కేసీఆర్ సర్కారే. రికార్డులన్నీ పక్కాగా, పకడ్బందీగా రూపొందించారు. యజమానికి తెలియకుండా గుంట భూమి కూడా వేరేవారి పేరిట బదిలీ కావడం లేదు. గతంలో పహణీలో ఒక రైతుపేరిట రెండు ఎకరాలు ఉంటే దాన్ని దళారులు, అధికారులు కలిసి అదే భూమిని మరో ఇద్దరి పేరిట రిజిస్ట్రేషన్ చేసేవారు. రైతుల మధ్య తగాదాలు సృష్టించేవారు. అలాంటి భూ సమస్యలు ఇప్పటికీ తెగడం లేదు. అధికారుల చేతుల్లో ఉన్న భూములకు సంబంధించిన సమస్యలు ఇప్పటికీ కోర్టులో పెండింగ్ ఉన్నాయి. రికార్డులను తారుమారు చేయడం ద్వారా నిజమైన రైతుకు అన్యాయం జరుగుతుంది. ధరణిని తీసేస్తే మన భూమి మన పేరిటే ఉంటుందనే నమ్మకం లేదు. ధరణి పోర్టల్ ద్వారానే మన భూములకు భద్రత. ధరణి ఉండాలంటే బీఆర్ఎస్ సర్కారు ఉండాలి.

**- అల్లావుద్దీన్, ఎత్తొండ, కోటగిరి మండలం**

## రిజిస్ట్రేషన్ అంటే చెప్పులు అరుగుతుండె..



ఒకప్పుడు భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే చెప్పులు అరిగిపోతుండె. అదిగూడ సక్కగ చేయకుండె. మా పాస్‌బుక్కులు మాకు ఇయ్యతందుకు తిప్పలు పెడుతుండె. పైసలు ఇయ్యకుంటే పని ముట్టకుండె. కొన్నేండ్లసంది గా బాధలు లేవు. సీఎం కేసీఆర్ సార్ వచ్చినంక ధరణి పెట్టిండు. జల్దిన పని అయిపోతున్నది. ఎమ్మార్వో అఫీస్‌కు పిలిపిచ్చి కండ్ల ముంగట రిజిస్ట్రేషన్ చేస్తున్నరు. వారం దినాలల్ల ఇంటికే టాప్పాలో పాస్‌బుక్కు వస్తున్నది. ఇది చాలా సౌలత్ ఉన్నది. గింతమంచి ధరణిని తీసేస్తామంటే ఎవరన్నా ఊరుకుంటరా.. కాంగ్రెస్‌కు ఓటేస్తరా? మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి గావాలె.

**-మెగావత్ రవి, దుబ్బ తండా, ఎడపల్లి మండలం**

## ధరణి ఎత్తేస్తే భూములకు రక్షణ ఉంటదా?



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తారు. దళారులు పెరుగుతారు. ఇష్టారాజ్యం ఉంటది. ఇక మా భూములకు భద్రత ఎక్కడిది. దళారీ వ్యవస్థ కోసమే ధరణిను రద్దు చేస్తామని అంటుంది. కాంగ్రెస్ హయాంలో ఇష్టానుసారంగా రికార్డులు మారిపోయాయి. ఒకరి భూములు మరొకరికి మార్చేవారు. వాటిని మళ్లీ మార్చుకోవడం కోసం చాలా ఇబ్బందులు పడ్డాం. అధికారుల చుట్టూ తిరిగితిరిగి చెప్పులు అరిగి పోయేవి. ధరణితో మా భూములకు భద్రత ఏర్పడింది. సమస్యలన్నీ పోయినాయి. ఒక్కసారి ధరణిలో నమోదైన భూములను మార్చడం ఎవరివల్ల కాదు. అలాంటి ధరణి పోర్టల్‌ను తొలగిస్తామంటే భయంగా ఉంది. మరోసారి రైతులు మోసపోవడం ఖాయం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతాం.

**-ఆర్. శంకర్‌నాయక్, రాజీవ్‌నగర్ తండా, బోధన్ మండలం**